



విశేష అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారు

మోదకొండమ్మ నమో నమః



ఘటాలతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

వైభవంగా మాడుగుల అమ్మవారి జాతర

» పోటెత్తిన భక్తజనం

మాడుగుల, జూన్ 18: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆరు గంటల తరువాత సతకంపట్టు వద్ద కొలువుతీరిన అమ్మవారి పాదాలు, ఘటాలను గ్రామంలో ఊరేగించి తిరిగి అమ్మవారి ఆలయానికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ పి.దామోదరనాయుడు పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ద్వితీయ ఇంటర్‌లో 61.24 శాతం ఉత్తీర్ణత

» అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



అనకాపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. మే 24వ తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 4,430 మంది హాజరయ్యారు. వీరిలో 2,713 మంది (61.24 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 709 మంది హాజరు కాగా, 402 మంది (57 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఈ నెల 26న ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల కానున్నాయని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు వెల్లడించారు.

గోవాడ షుగర్స్‌పై చిగురిస్తున్న ఆశలు

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుపై ఇప్పటికే ఎంపీ సీఎం రమేశ్ హామీ

» కూటమి ప్రభుత్వం రాకతో కార్మికులు, రైతుల్లో పెరిగిన నమ్మకం

» వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఫ్యాక్టరీకి మంచిరోజులు రానున్నాయని ఆశాభావం



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, జూన్ 18: **గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి మంచిరోజులు రానున్నాయి. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండడంతో గోవాడ షుగర్స్‌లో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు ఖాయంగా కనిపిస్తున్నది. ఆర్థిక ఇబ్బందులతో మనుగడ ప్రశ్నార్థకంగా ఉన్న గోవాడకు ఇథనాల్ ప్లాంట్‌తో మహర్దశ పట్టే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.**

వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలు మూతపడగా, మిగిలిన ఏకైక గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సైతం ప్రభుత్వ చేయూత కరువై, ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. వాస్తవానికి గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉంటే గోవాడ పరిధిలో చెరకు సాగు పెరగడంతో పాటు రైతులకు ఫ్యాక్టరీపై నమ్మకం పెరిగేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు విషయంలో ఆది నుంచీ ప్రకటనతోనే కాలక్షేపం చేసింది. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గాడిలో పడాలంటే పంచదార ఉత్పత్తితో పాటు ఇతర అనుబంధ ఉత్పత్తులు చేపట్టాలని గతంలో ఫ్యాక్టరీపై అధ్యయనం చేసిన అధికారుల బృందం కూడా నిర్ధారించింది. షుగర్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే మొలాసిస్‌ను వినియోగించుకునేలా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటయితే, షుగర్ ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందులు తీరి, ఫ్యాక్టరీ నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు చాలాకాలం క్రితమే నిర్ధారించారు. పెట్రోల్‌లో ఇథనాల్ వాడకం తప్పనిసరి కావడంతో మొలాసిస్‌ను ఉపయోగించుకుని ఇథనాల్ ప్లాంట్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చే షుగర్ ఫ్యాక్టరీలకు ఉద్దీపన పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితమే వడ్డీ లేని రుణాలతో పాటు ఇతర రాయితీలు ఇస్తామంటూ స్పష్టంగా హామీ ఇచ్చింది. దీనిపై వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే 30 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటిస్తూ, తొలి విడతగా రూ. 26 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు కూడా కేటాయించడంతో అప్పట్లో ఇటు ఫ్యాక్టరీ వర్గాల్లో అటు రైతాంగంలో కూడా ఎంతో సంబరపడ్డారు. తీరా రైతులు, కార్మికుల ఆశలు అడియాశలు చేసేలా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు మంజూరు చేసిన రూ. 26 కోట్ల నిధులను తిరిగి వెనక్కి తీసేసుకుంది. ఆ తరువాత నుంచి ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు ప్రకటనలకే పరిమితమైంది.



గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో సోమవారం ఎంపీ సీఎం రమేశ్‌ను కలిసిన కార్మికులు

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ముందుకు సాగని ప్రక్రియ

గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు గతంలో గోవాడ యాజమాన్యం పంపిన ప్రతిపాదనకు కేంద్ర పర్యావరణశాఖ గత ఏడాది జూన్ 10న అనుమతి ఇచ్చింది. బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర పర్యావరణ శాఖ ... మిగతా 8వ పేజీలో

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుతో ఎంతో మేలు



ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటయితే చెరకు రైతులు, కార్మికులకు మేలు చేకూరుతుంది. ఏడాది పొడవునా ప్లాంట్ నడిచే అవకాశం ఉంది. పంచదార ఉత్పత్తి తగ్గించి ఇథనాల్ ఉత్పత్తి పెంచడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధరతో పాటు సకాలంలో పేమెంట్లు చెల్లింపులకు వీలుంటుంది. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫ్యాక్టరీ ఆర్థికంగా నిలదొక్కు కోవడానికి అవకాశం ఉంటుంది.

- శరగడం రామునాయుడు, గోవాడ షుగర్స్ కార్మిక సంఘం నాయకుడు

రైతులకు చేయూత

పెట్టుబడి సాయంగా పీఎం కిసాన్ నిధులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం

» జిల్లాలో 1.87 లక్షల మందికి రూ.37.7 కోట్లు విడుదల

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)



రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద మంగళవారం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఈ పథకం కింద 1.87 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.37.7 కోట్లు జమ కానున్నాయి.

జిల్లాలో పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద 1.87 లక్షల మంది లబ్ధిదారులుగా జిల్లా వ్యవసాయాధికారులు తేల్చారు. వీరిలో 1,438 మంది ఇంకా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి చేసిన రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రూ.37.7 కోట్లు విడుదల చేసింది. అనకాపల్లి మండలంలో 10,624 మంది రైతులు, అచ్యుతాపురం మండలంలో 6,390 మంది, బుచ్చెయ్యపేట మండలంలో 10,713, చీడికాడలో 7,698, చోడవరంలో 8,217, దేవరాపల్లిలో 9,242, గొలుగొండలో 5,776, కె.కోటపాడులో 7,861, కశింకోటలో 6,957, కోటవురట్ల లో 9,061, మాడుగులలో 10,444, మాకవరపాలెంలో 7,458, మునగపాకలో 7,119, నక్కపల్లి లో 8,233, నర్సీపట్నంలో 6,009, నాతవరంలో 8,233, పరవాడలో 4,439, పాయకరావుపేటలో 5,686, రాంబిల్లిలో 5,922, రావికమతంలో 11,265, రోలుగుంటలో 8,874, ఎస్.రాయవరంలో 7,451, సబ్బవరంలో 8,022, ఎలమంచిలి మండలంలో 5,904 మంది లబ్ధిదారులు ఉన్నట్టు అధికారులు నిర్ధారించారు. జిల్లాలో రైతుల బ్యాంకు ఖాతాలు మండలాల వారీగా వేల సంఖ్యలో ఉన్నందున బ్యాంకుల ద్వారా కొందరు రైతులకు ముందుగా, మరికొందరికి రెండు, మూడు రోజులు ఆలస్యంగా నగదు జమ అవుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖాధికారి జి.మోహన్‌రావు తెలిపారు.

ఉల్లంఘనులకు చెక్ పడేనా?

యథేచ్ఛగా క్వారీల్లో తవ్వకాలు

» ప్రభుత్వం మారినా కొనసాగుతున్న వైసీపీ నేతల దందా

» వత్తాసు పలుకుతున్న కొందరు అధికారులు

» మైనింగ్ నిలిపి వేయాలని కూటమి ప్రభుత్వం మౌఖిక ఆదేశాలిచ్చినా బేఖాతరు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కంకర క్వారీల్లో వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డుకట్ట పడలేదు. ప్రభుత్వం మారినా వారి ఆధిపత్యమే కొనసాగుతుండడం గమనార్హం. గనుల శాఖలోని కొందరు అధికారులు వారికే వత్తాసు పలుకుతుండడం విమర్శలకు తావిస్తోంది.



అనకాపల్లి మండలం మార్టూరులో వైసీపీ నాయకుల చేతిలో వున్న క్వారీ

జిల్లాలోని వివిధ మండలాల్లో సుమారు 220 రోడ్డు మెటల్ క్వారీలు, 65కు పైగా స్టోన్ క్రషర్లు ఉన్నాయి. వీటిలో సగానికిపైగా కంకర క్వారీలు, క్రషర్లు అనకాపల్లి మండలంలోనే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు కంకర క్వారీలను తమ ఆధీనంలో పెట్టుకొని ఖనిజ సంపదను ఎడాపెడా దోచుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో గనుల శాఖలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటి లెక్కలు తేలుస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు అనేక సందర్భాల్లో తెలిపారు. అయితే అనకాపల్లి జిల్లాలో మాత్రం కొందరు గనుల శాఖాధికారులు గట్టుచప్పుడు కాకుండా గత వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలకే వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనకాపల్లి మండలంలో మార్టూరు, ఊడేరు, మామిడిపాలెం, హెచ్ఎస్ అగ్రహారం, మాకవరం, కుంచంగి, కూండ్రం, వేటజంగాలపాలెం, రొంగలివానిపాలెంలలో పదుల సంఖ్యలో కంకర క్వారీలు నడుస్తున్నాయి. వీటిలో అన్ని అనుమతులు ఉన్న క్వారీలను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అనకాపల్లి మండలంలో మంత్రి అనుచరులు కంకర క్వారీలను తమ కబంధ హస్తాల్లో పెట్టుకొని అడ్డగోలుగా దోచుకున్నారు. అనుమతి లేని కంకర క్వారీలను వైసీపీ నేతలు నయానో భయానో తమ ఆధీనంలోకి తెచ్చుకొని ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకపోయినా కొండలను పిండిచేసి, రోడ్డు మెటల్, బేబీ చిప్స్ వంటివి స్టోన్ క్రషర్ల ద్వారా అమ్ముకొని జేబులు నింపుకున్నారు. అలాగే సరిహద్దులను దాటి కొండలను కొల్లగొట్టి ప్రభుత్వానికి చెందాల్సిన రాయల్టీ కూడా చెల్లించలేదని తెలిసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కంకర క్వారీలను నిలుపుదల చేయాలని జిల్లా గనుల శాఖకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు గనుల దోపిడీకి చెక్‌పెట్టి త్వరలోనే కొత్త పాలసీని అమలులోకి తేవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ పరిస్థితిలో మార్పు రాలేదు. వైసీపీ అధికారంలో ఉండగా సహజ వనరులను ఇష్టారాజ్యంగా దోపిడీ చేసిన అక్రమార్కులు యథావిధిగా తమ గనుల దోపిడీ పర్వాన్ని కొనసాగిస్తున్నారు. కొంతమంది వైసీపీ నాయకులు తామంతా కూటమి ప్రభుత్వానికే మద్దతు పలికామంటూ ప్రచారం చేసుకుంటూ పాత పద్ధతిలోనే కంకర క్వారీల్లో అడ్డగోలు తవ్వకాలు, బాంబు బ్లాస్టింగ్‌లు కొనసాగిస్తున్నారు. గనుల శాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులు ఎటువంటి తనిఖీలు నిర్వహించకుండా పరోక్షంగా వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వైసీపీ గుప్పిట్లో క్వారీలు

జిల్లాలో గతంలో అనుమతులకు మించి చుట్టుపక్కల ప్రాంతాలను ఆక్రమించి బ్లాస్టింగ్ చేసి కంకర దోపిడీకి కొందరు పాల్పడినట్టు గుర్తించారు. 2018-19 సంవత్సరం మధ్య కాలంలో గనులశాఖ విజిలెన్స్ అధికారుల బృందం అనకాపల్లి మండలంలోని పలు క్వారీల్లో తనిఖీలు చేసి రూ.120 కోట్లకు పైగా జరిమానా విధించారు. ఈ మొత్తం చెల్లించాలని అప్పట్లో 18 క్వారీల నిర్వాహకులకు అనేక పర్యాయాలు నోటీసులు కూడా జారీ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నాయకులు పథకం ప్రకారం క్వారీల నిర్వాహకుల నుంచి కప్పం తీసుకొని జరిమానాను మాఫీ చేయించినట్టు ... మిగతా 8వ పేజీలో

రహదారి విస్తరణ పనులపై సీరియస్

ఆర్ అండ్ బీ రోడ్డులో మునిసిపాలిటీ పెత్తనం ఏమిటని అయ్యన్న నిలదీత

» నాణ్యత పరిశీలించకుండా బిల్లులు ఇవ్వొద్దని ఆదేశం



నర్సీపట్నంలో ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణపై అధికారులను నిలదీస్తున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూన్ 18 : ఆర్ అండ్ బీ రోడ్డులో మునిసిపల్ కమిషనర్ పెత్తనం ఏమిటని అధికారులను స్థానిక ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు నిలదీశారు. మంగళవారం ఆర్ అండ్ బీ, మునిసిపల్ అధికారులతో కలిసి మెయిన్ రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూడిద వేసి నాణ్యత లేకుండా రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారని ఐదు సార్లు ఫిర్యాదు చేశానని, ఎందుకు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బీ అధికారుల అనుమతి లేకుండా ఆ శాఖకు సంబంధించిన రోడ్డు నిర్మాణం మునిసిపల్ అధికారులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. పనుల నాణ్యత చూడకుండా డబ్బులు ఎలా మంజూరు చేస్తారని అధికారులను నిలదీశారు. అనంతరం శారదానగర్ బైపాస్ రోడ్డును పరిశీలించారు. ఇక్కడ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు తన హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశామని, డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉండి పోయాయని తెలిపారు. అధికారులను కారణం అడిగితే డ్రైనేజీ పనులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అడ్డుగా ఉన్నాయని, దుర్గగుడి వద్ద ముందు భాగం పోతుందని తెలిపారని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి ఆర్టీసీ స్థలం చాలా ఉందని, ఇబ్బంది లేదని అన్నారు. దుర్గ గుడి వద్ద ముందు భాగం కొంత పోయినా తిరిగి నిర్మించుకోవచ్చునని తెలిపారు. వెంటనే పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ పర్యవేక్షణ ఇంజనీర్ కాంతిమతి, అనకాపల్లి ఈఈ రమేశ్‌కుమార్, పాడేరు ఈఈ బాలసుందరం, నర్సీపట్నం డీఈ నాగమోహన్, కమిషనర్ పూడి రవిబాబు, డీఈఈ నారాయణ పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో ర్యాంకుల పంట

జియో ఇంజనీరింగ్, మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో ప్రథమ ర్యాంకులు

» సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

» పది లోపు ర్యాంకులు అనేక మందికి రాక

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్/ఫార్మసీ కళాశాలల్లో ఎంటెక్/ఎం.ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపీ పీజీసెట్‌లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విద్యార్థులు మూడు కేటగిరీలలో ప్రథమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. జియో ఇంజనీరింగ్‌లో నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన సింగంశెట్టి రమ 78 మార్కులతో, మెకానికల్ ఇంజనీరింగ్‌లో పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామానికి చెందిన పైలా హేమంత్ 80 మార్కులతో, మెటలర్జీలో అనకాపల్లి మండలం వీజే పాలెం గ్రామం క్వారీ కాలనీ విద్యార్థి నందికొల్లు అనిల్‌కుమార్ 86 మార్కులతో ప్రథమ ర్యాంకులు సాధించారు. అలాగే జియో ఇంజనీరింగ్‌లో మద్రిపాలెం వుడా కాలనీ విద్యార్థిని తురుపల్లి కీర్తి రెండో ర్యాంకు, టీఎస్ఎన్ కాలనీలో ఉంటున్న మహ్మద్ అసిత్ సింకా మూడో ర్యాంకు, రోలుగుంట విద్యార్థి రుత్తల వెంకటకృష్ణ ఎనిమిదో ర్యాంకు, దేవరాపల్లి మండలం మారేపల్లికి చెందిన గేదెల నవ్య తొమ్మిదో ర్యాంకు సాధించారు. బయో టెక్నాలజీలో విశాఖకు చెందిన దాసరి దేదీప్య 10వ ర్యాంకు, సివిల్ ఇంజనీరింగ్‌లో కె.కోటపాడు మండలం వారాడ విద్యార్థి రాచపల్లి హేమంత్ రెండో ర్యాంకు, అనకాపల్లి దరి అడ్డాసరం విద్యార్థి పి.మహేష్ ఐదో ర్యాంకు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో రాంబిల్లి మండలం కొప్పుగుంటపాలెం గ్రామానికి చెందిన గొన్నబత్తుల సాయికుమారి ఏడో ర్యాంకు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో నగరంలోని శాంతిపురానికి చెందిన గనగళ్ల హాయిశ్రీ 11వ ర్యాంకు, ఫుడ్ టెక్నాలజీ కోర్సులో చైతన్యనగర్‌కు చెందిన హనుమంతు ధారణి నాలుగో ర్యాంకు, మెటలర్జీలో కంచరపాలేనికి చెందిన గుడ్ల జయంత్ మూడో ర్యాంకు, శ్రీనగర్ కాలనీకి చెందిన రాయవరపుముత్యాలనాయుడు నాలుగో ర్యాంకు సాధించారు.

బాబోయ్ ఎండలు

» ఉక్కపోతతో జనం విలవిల

అనకాపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ముగిసినప్పటికీ పగటిపూట ఉష్ణోగ్రతలు మాత్రం ఇంకా ఏమాత్రం తగ్గడం లేదు. జిల్లాలోని పలు మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జనం ఉక్కపోతతో అల్లాడిపో తున్నారు. మంగళవారం జిల్లాలో 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, ఎలమంచిలి మండలాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో రెండు రోజుల కిందట పలు మండలాల్లో వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడిందని జనం కాస్త ఉపశమనం పొందినా, గత రెండు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవడమే కాకుండా మండిపోతున్న ఎండలతో మళ్లీ జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

క్రైం... crime news

భార్య, ఇద్దరు పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

ఎలమంచిలి, జూన్ 18: ఆస్పత్రికి వెళుతున్నామని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన తన భార్య ఇద్దరు పిల్లలు కనిపించడం లేదని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం మంగళవారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మునిసిపాలిటీలోని పెద్ద గొల్లలపాలెం గ్రామానికి చెందిన ఈగల రవి అచ్యుతాపురం మండలం మడుతూరులోని ఓ పెట్రోలు బంకులో పనిచేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన అచ్యుతాపురం ఆస్పత్రికి వెళుతున్నామని చెప్పి అతని భార్య నూకరత్నం,కుమారుడు యశ్వంత్, తొమ్మిది నెలల చిన్నారి ఇంటి నుంచి వెళ్లారు. అయితే అప్పటి నుంచి కనిపించడం లేదని రవి ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

▸ మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన అల్లు దుర్గారావు

కోటవురట్ల, జూన్ 18: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం లింగాపురం వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కోటవురట్ల ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోటవురట్ల మండలం జగ్గంపేట గ్రామానికి చెందిన అల్లు దుర్గారావు(26) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్యకు మూడు రోజుల క్రితం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో డెలివరీ అయ్యి పాపకు జన్మనిచ్చింది. భార్య, కుమార్తెను చూసేందుకు దుర్గారావు మంగళవారం కే.వెంకటాపురంలోని అత్తవారింటికి వచ్చాడు. అక్కడి నుంచి బైక్‌పై ఆస్పత్రికి బయలుదేరాడు. దారి మధ్యలో తిమ్మాపురం జంక్షన్ వద్ద తన అన్నయ్య అల్లు రమేశ్‌ను బైక్ ఎక్కించుకున్నాడు. లింగాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలో కుంచా అప్పలనాయుడు పాకలు సమీపంలో రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతివేగం గుర్తు తెలియని నాలుగు చక్రాల వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గారావు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రమేశ్ కుడిచేయి విరిగి పోగా పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. అతనిని 108 వాహనంపై కోటవురట్ల 50 పడకల ఆస్పత్రికి తరలించగా, మెరుగైనా వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు. దుర్గారావు మృతదేహాన్ని కోటవురట్ల ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా విశాఖ

▸ దేశవ్యాప్తంగా 30 నగరాలను గుర్తించిన రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ
▸ జాబితాలో 17వ స్థానంలో నగరం
▸ రాష్ట్రం నుంచి తిరుపతికి చోటు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి హాట్ స్పాట్‌గా ఉన్న 17 నగరాల్లో విశాఖపట్నం స్థానం సంపాదించుకుంది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కాలరీస్ ఇండియా దేశంలోని 100కు పైగా నగరాలను సర్వే చేసి అందులో ఎక్కువగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉన్న 30 నగరాలను గుర్తించింది. అందులో 17 నగరాలైతే మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ పదిహేడు నగరాల్లో రెండు ఆంధ్రప్రదేశ్ నుంచే ఉండడం విశేషం. అందులో ఒకటి తిరుపతి కాగా మరొకటి విశాఖపట్నం. ఆయా నగరాల్లో మౌలిక వసతులు మెరుగు పరచడానికి, అభివృద్ధికి అనుగుణంగా కొత్త ప్రాజెక్టులను అక్కడి ప్రభుత్వాలు చేపట్టడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం విస్తరించనుందని సంస్థ విశ్లేషించింది. చక్కటి హోటళ్లు, రిటైల్ మార్కెట్లు కూడా దీనికి దోహదపడతాయని వెల్లడించింది.

పెరుగుతున్న ఎంక్వయిరీలు

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత నగరంలో రియల్ ఎస్టేట్ రంగం కూడా ఊపిరి పీల్చుకుంది. అంతకు ముందు ప్రభుత్వం మూడు రాజధానులు అంటూ ప్రకటనలు గుప్పించి విశాఖపట్నంలో లేని బూమ్ క్రియేట్ చేయడానికి యత్నించింది. అమరావతిలో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలేలా చేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అమరావతిలో రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తిచేస్తామని, విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో అటు అమరావతి, ఇటు విశాఖపట్నం రెండు నగరాల్లోను ఫ్లాట్లు, ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారు. అయితే విశాఖపట్నంలో ఊహించని విధంగా పెరిగిపోయిన భూముల రేట్లు, ఫ్లాట్ల ధరలు ఏమైనా తగ్గుముఖం పడతాయా?...అని కొనుగోలుదారులు ఎదురుచూస్తున్నారు. నాలుగేళ్ల క్రితం విశాఖపట్నం నుంచి హైదరాబాద్, భువనేశ్వర్ వంటి నగరాలకు వెళ్లిపోయిన రియల్ ఎస్టేట్ సంస్థలు మళ్లీ విశాఖపట్నంలో ప్రాజెక్టులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

కూటమి కార్యకర్తలు తలెత్తుకునేలా చేస్తా

▸ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


ఎంపీ రమేశ్, ఎమ్మెల్యే పంచకర్లను సత్కరిస్తున్న కూటమి నాయకులు

పెందుర్తి, జూన్ 18: రాష్ట్రంలో సుస్థిరత ప్రభుత్వం ఏర్పాటుకు కూటమి కార్యకర్తలే కారణమని, వారి గౌరవం తగ్గకుండా తలెత్తుకునేలా చేస్తానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. స్థానిక తాండ్రపాపారాయుడు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ కూటమి కార్యకర్తల ఆత్మీయ విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాలను గుర్తిస్తామన్నారు. ఇతరులు కూటమిలో చేరుతారన్న ప్రచారం ఊహాజనితమని, ఎవరు పడితే వారు వచ్చి చేరేందుకు కూటమి ఏమీ డంపింగ్ యార్డు కాదని, తమది చారిత్రాత్మక పొత్తు అని అన్నారు. పెందుర్తిలో త్వరలో ఇల్లు కట్టుకుంటానని, ప్రజలకు సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానన్నారు. కార్యకర్తలు పిలిస్తే పలుకుతానని, వారి సమస్యలను పరిష్కరించడం బాధ్యతగా తీసుకుంటాన్నారు.

ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ ఎంపీ సీఎం రమేశ్ పెద్దన్నలా వ్యవహరించడం వల్లే అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజవర్గాల్లో గెలుపు సాధ్యమైందన్నారు. పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అధికంగా నిధులు వెచ్చించవలసిందిగా కోరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. అనంతరం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కోరుపోలు రాము నాయుడు ఆధ్వర్యంలో, ఎంపీ, ఎమ్మెల్యేలను పలువురు కూటమి నాయకులు గజమాలతో వేసి దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, నాయకులు రెడ్డి నారాయణరావు, ముదునూరి రాజాసుధాకర్, అయిత సింహాచలం, సుఖవాసి అజయ్, గొర్లె అప్పారావు, జ్యోతి, పిన్నింటి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులపై ఎమ్మెల్యే ఆగ్రహం

ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు

▸ నాణ్యతపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వండి
▸ బిల్లులు మంజూరు చేయవద్దు
▸ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం


ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు

గొలుగొండ, జూన్ 18: ఆరిలోవ అటవీ ప్రాంతంలో నాలుగు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లోపించిందని నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆర్‌అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రోడ్డు విస్తరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు రోడ్డు నిర్మాణాలు చేపట్టారా అని ఆరా తీశారు. అనంతరం రోడ్డు కొలతలు తీయించి పరిశీలించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు విలేకరులతో మాట్లాడుతూ తారు రోడ్డు పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు అప్పగించి, అనుభవం లేని కాంట్రాక్టర్‌తో పనులు చేయించారని అధికారులపై మండిపడ్డారు. 2018లో టీడీపీ హయాంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వరకూ 24 కిలోమీటర్ల మేర పనులకు రూ.24 కోట్లు మంజూరు చేశామన్నారు. 2019 ఎన్నికల్లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాలుగు కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు ఎన్నికల ముందు అటవీ శాఖ అనుమతులు తీసుకువచ్చిందని, సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆదరాబాదరాగా పనులు చేపట్టిందన్నారు. కల్వర్టుల నిర్మాణాలు చేపట్టకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం ఏమిటని అధికారులను నిలదీశారు. అలాగే రోడ్డుకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయవద్దని అధికారులను ఆదేశించారు. నాణ్యత లోపంపై వారం రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక అందించాలని ఆర్‌అండ్‌బీ శాఖాధికారులను ఆదేశించారు. దీనిపై సరైన సమాధానం చెప్పలేకపోతే అధికారులు సెలవులపై వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కె.కాంతిమతి, పాడేరు ఈఈ పి.బాలసుందరబాబు, నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ డీఈ నాగమోహన్, మండల జేఈ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సీహెచ్. తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు ఆదపురెడ్డి గోపాలకృష్ణ, భీమిరెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్, గెడ్డం సత్యనారాయణ, చిటికెల సాంబమూర్తి, లాలం కాశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డ స్థలం ఆక్రమించేశారా?

చోడపల్లి- కొండకర్లకు మధ్య మూడెకరాలను రియల్టర్ కబ్జా చేశారంటూ ఆరోపణలు

▸ గతంలో అది కొండ గెడ్డ అంటున్న గ్రామస్థులు
▸ పక్కా జిరాయితీ అని చెబుతున్న వీఆర్వో


కొత్తగా నిర్మిస్తున్న ప్రహరీని అనుకొని ఉన్న కొండ గెడ్డ

అచ్యుతాపురం, జూన్ 18: చోడపల్లి- కొండకర్లకు మధ్య సుమారు మూడెకరాల గెడ్డ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ రియల్టర్ దానిని ఆక్రమించుకొని చదును చేస్తున్నాడని చోడపల్లి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే ఇది పక్కా జిరాయితీ భూమి అని కొండకర్ల వీఆర్వో సింహాచలం నాయుడు అంటున్నారు.

చోడపల్లి జగనన్న కాలనీని ఆనుకొని గెడ్డ పోరంబోకు ఉండేది. వర్షాలకు ఈ గెడ్డ నుంచి నీరు ప్రవహించి కొంత కొండకర్ల చెరువులోకి, మరికొంత ఎర్రవరం చెరువులోకి వెళ్లేది. ఈ ప్రాంతంలో తాము పశువులను మేపుకొనే వాళ్లమని, అయితే ఇప్పుడు ఈ గెడ్డను గ్రావెల్‌తో నింపి ప్రహరీ నిర్మిస్తున్నారని చోడపల్లి గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో ఒక రియల్టర్ చోడపల్లి కొండ నుంచి కొండకర్ల వరకు భూములను కొని భారీ స్థాయిలో ప్రహరీ నిర్మించుకున్నారు. ఈ గెడ్డ ప్రాంతాన్ని మాత్రం వదిలేశాడు. ప్రస్తుతం పాత ప్రహరీని ఆనుకొని ఉన్న గెడ్డ పోరంబోకును గ్రావెల్‌తో కప్పి కొత్తగా ప్రహరీని నిర్మిస్తున్నాడని, తమ పశువులను కూడా అందులోకి రానివ్వడం లేదని చోడపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇది పక్కా జిరాయితీ అని కొండకర్ల వీఆర్వో సింహాచలం నాయుడు తెలిపారు. గతంలో ఒక రియల్టర్ చోడపల్లి, కొండకర్ల మధ్య సుమారు 27 ఎకరాలు భూమిని కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నాడు. ప్రస్తుతం గోడ కడుతున్న భూమి కూడా సర్వే నంబరు 102 పరిధిలో ఉంది. గతంలో దీని నుంచి కొండగెడ్డ ప్రవహించినప్పటికీ అది డీపట్టా భూమి. జగన్ ప్రభుత్వం డీపట్టా భూములను జిరాయితీగా మార్పు చేస్తూ జీవో విడుదల చేయడంతో రియల్టర్ దీనిని జిరాయితీగా మార్పు చేసిన తరువాత పక్కా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. గెడ్డ మాత్రం సర్వే నంబరు 103లో ఉందని వీఆర్వో తెలిపారు.


గ్రావెల్ వేసి చదును చేసి ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

చోడవరం సీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బాలింత, బిడ్డ మృతి

▸ బాలింత కుటుంబ సభ్యుల ఆరోపణ
▸ చీడికాడ, తునివలస గ్రామాల్లో విషాదం


బత్తిన హేమకుమారి (ఫైల్)

చీడికాడ, జూన్ 18: చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సిబ్బంది నిర్లక్ష్యం వలనే బాలింత హేమకుమారి, బిడ్డ మృతిచెందారని బాలింత భర్త బత్తిన ప్రతాప్, మామ బత్తిన ఎర్రన్న రోదిస్తూ ఆరోపించారు. ఇందుకు సంబంధించి వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలో తునివలస గ్రామానికి చెందిన హేమకుమారి(19)కు చీడికాడలో ఉన్న బత్తిన ప్రతాప్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. ఆమె 9వ నెల గర్భిణి కావడంతో గత శుక్రవారం చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. అక్కడ హేమకుమారిని తనిఖీ చేసిన వైద్యాధికారులు డెలివరీ సమయమని, మీరు ఇక్కడే ఉంచాలని ఆదేశించారు. దీంతో హేమకుమారిని చోడవరం సీహెచ్‌సీలో ఉంచారు. శుక్రవారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకూ వైద్యపరీక్షలు చేసిన వైద్యాధికారి, సిబ్బంది డెలివరీ కాలేదని, వెంటనే అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించాలని సిఫార్సు చేయడంతో 108లో కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ తనిఖీ అనంతరం కడుపులో చనిపోయిన బిడ్డని ఆపరేషన్ చేసి తీశారన్నారు. అయితే బాలింతకు అధిక రక్తస్రావం కావడంతో వెంటనే కేజీహెచ్‌కు తరలించాలని ఆదేశించడంతో 108లో ఆదివారం మధ్యాహ్నం కేజీహెచ్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 8గంటల సమయంలో బాలింత హేమకుమారి మృతి చెందినట్టు విశాఖ కేజీహెచ్ వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు తెలిపారు. చోడవరం సీహెచ్‌సీ సిబ్బంది రెండు రోజులు గర్భిణిని ఇక్కడ ఉంచి, పరిస్థితి విషమించాక అనకాపల్లి పంపారని, దీనికి వారే కారకులని కుటుంబ సభ్యులు విలేకరులకు తెలిపారు. బిడ్డ, బాలింత మృతితో చీడికాడ, తునివలస గ్రామాల్లో విషాదం నెలకొంది.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

అనకాపల్లి టౌన్, జూన్ 18: రాగల ఐదు రోజుల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఓ మోస్తరుగా వర్షాలు కురిసే అవకాశముందని స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. మంగళవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఐదు రోజులు ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 33.8 నుంచి 36.6 డిగ్రీల సెల్సియస్‌గా ఉండవచ్చునని తెలిపారు. వరి పైరు వేసుకునే రైతులు రాగల వర్షాలను వినియోగించుకుని వరినారుకు నేల తయారు చేసుకోవాలన్నారు. అధిక దిగుబడులకు ఆర్‌జీఎల్-2537 వరి రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1262 రకాలను, అలాగే ఎంటీయూ 7029కి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318 రకాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. వరినారు మడిలో ఆకు ఎండు తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా గట్ల మీద ఉన్న కలుపు మొక్కలను తీసివేయాలని సూచించారు. మొక్కజొన్నను సాగు చేసే రైతులు రాగల ఐదు రోజుల్లో వర్షసూచన ఉన్నందున సద్వినియోగం చేసుకుని ఖరీఫ్ మొక్కజొన్న పంటకు నేల దున్ని తయారు చేసుకుని అధిక దిగుబడినిచ్చే డీహెచ్‌ఎం-117, డీహెచ్‌ఎం-119, డీహెచ్‌ఎం-121 వంటి రకాలను ఎకరాకు ఎనిమిది కిలోల చొప్పున విత్తుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం.విశాలాక్షి, డాక్టర్ వి.గౌరీ, డాక్టర్ సీహెచ్ సీతారామలక్ష్మి, డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్ పీవీ పద్మావతి, డాక్టర్ ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు

జోరుగా గంటి నాట్లు

▸ మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం
▸ రైతులకు లాభదాయంగా ఉన్న సజ్జలు
▸ గ్రామాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు
▸ సాగుకు ఆసక్తి కనబరిచిన రైతులు


మల్లునాయుడుపాలెంలో గంటి నాట్లు(సజ్జ) వేస్తున్న రైతులు

సబ్బవరం, జూన్ 18: మండలంలోని పలు గ్రామాల్లో గంటి(సజ్జలు) నాట్లు జోరుగా సాగుతున్నాయి. శనివారం, ఆదివారం వర్షాలు కురవడంతో మలునాయుడుపాలెం, గుల్లేపల్లి, మొగలిపురం, సబ్బవరం, గొర్లివానిపాలెం, తవ్వవానిపాలెం, అంతకాపల్లి, రాయపుర అగ్రహారం, అమృతపురం, అసకపల్లి, పైడివాడ, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో రైతులు గంటి నాట్లు వేస్తున్నారు. గతం కంటే గంటి సాగు విస్తీర్ణం పెరిగనట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 1200 ఎకరాల్లో గంటి నాట్లు వేసే అవకాశం ఉన్నట్టు వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు.

ఇటీవల గంటి వినియోగం పెరిగింది. పల్లెలతో పాటు పట్టణ ప్రజలు గంటి వినియోగం పెంచారు. గంటిలో పీచు పదార్థం అధికంగా ఉండడంతో పాటు పోషక విలువలు ఉన్నట్టు ప్రచారం జరుగుతుండడంతో పూర్వవైభవం సంతరించుకుంటోందని పలువురు రైతులు చెబుతున్నారు. ఇటీవల వస్తున్న ఆహార మార్పులతో తృణ ధాన్యాల వినియోగం పెరిగింది. దీంతో గంటికి గిరాకీ పెరిగింది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వినియోదారులు మారుమూల గ్రామాలకు వెళ్లి గంట్లను కొనుగోలు చేస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు కూడా గంటిలను కొనుగోలు చేసేందుకు గ్రామాల బాట పడుతున్నాయి. దీంతో కిలో రూ.60 నుంచి రూ.70 ఉండే గంటిలు.. ఇప్పుడు గ్రామాల్లో కిలో రూ. 90 నుంచి రూ. 100 వరకూ కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు గంటి సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

పెరిగిన విస్తీర్ణం

గంటి సాగు లాభదాయకంగా ఉండడంతో మండలంలో సాగు విస్తీర్ణం పెరిగింది. ఐదేళ్ల క్రితం 600 ఎకరాల్లో గంటి పంటను సాగు చేసేవారు. ఈ ఏడాది 1200 ఎకరాలకు పెరిగిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తే సాగు విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

రైలులో హోం మంత్రి అనిత ప్రయాణం

▸ వందే భారత్ రైలులో విశాఖ నుంచి విజయవాడకు ..


వందే భారత్ రైలులో ప్రయాణికులతో హోం మంత్రి అనిత

నక్కపల్లి, జూన్ 18: రాష్ట్ర హోం మంత్రిగా వంగలపూడి అనిత బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచి పాలనలో తనదైన మార్క్ కనిపించేలా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష కూడా నిర్వహించి, శాంతి భద్రతల పరిరక్షణ, మహిళల భద్రతకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే మంగళవారం ఒక సాధారణ ప్రయాణికురాలిగా ఆమె వందే భారత్ రైలులో విజయవాడ వెళ్లారు. విశాఖ నుంచి మంగళవారం ఉదయం వందేభారత్ రైలులో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికులను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు ఆమెతో ఫొటోలు దిగారు. రైలు ప్రయాణికులకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకు వెళతానని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.

జూలై 18 లోపు అన్న క్యాంటీన్ సిద్ధం చేయండి

▸ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు


నర్సీపట్నం అన్న క్యాంటీన్ భవనంలో బోర్డులను పరిశీలిస్తున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూన్ 18: అన్న క్యాంటీన్ భవనాన్ని జూలై 18 తేదీలోపు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం మరమ్మతులు చేస్తున్న అన్న క్యాంటీన్ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మాదిరిగానే భవనానికి రంగులు వేయించాలని సూచించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదవాడికి రూ.5లకు భోజనం పెట్టాలన్న ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు పెట్టారని, సైకో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత వాటిని మూసేసి, పేదవారి పొట్ట మీద కొట్టారని విమర్శించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు, డీఈఈ నారాయణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణ నా బాధ్యత

▸ తొలి, తుది లక్ష్యం అదే...
▸ యాజమాన్యంతో చర్చించిన అనంతరం కేంద్రం ముందు మా ప్రతిపాదనలు ఉంచుతాం
▸ ఎంపీ శ్రీభరత్ సహకారంతో కర్మాగారానికి సొంత గనులు కేటాయింపునకు కృషి చేస్తాం
▸ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


రిలే దీక్షల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత

కూర్మన్నపాలెం, జూన్ 18: స్టీల్‌ప్లాంటు పరిరక్షణ తన ప్రధాన బాధ్యత అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరానికి విచ్చేసి, సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉక్కు కార్మికులకు అన్నివిధాలా సహాయ సహకారాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గర్భాం మాంగనీస్ గనులు, కింతాడ క్వార్ట్జ్ మైన్స్, సారిపల్లి ఇసుక రీచ్‌లు నెలలోగా స్టీల్‌ప్లాంటుకు రెన్యువల్ చేస్తామని హామీ ఇచ్చారు. విశాఖ స్టీలుప్లాంటును భావి తరాల వారికి అందించడమే తన తొలి, తుది లక్ష్యమన్నారు. ఈ నెల 24వ తేదీలోపు విశాఖ ఎంపీ ఎం.శ్రీ భరత్‌తో కలిసి స్టీలుప్లాంటు యాజమాన్యంతో చర్చించి ఓ ప్రణాళికను తయారుచేసుకొని, కేంద్ర ప్రభుత్వం ముందు తమ ప్రతిపాదనలు ఉంచుతామన్నారు. ఎంపీ శ్రీభరత్ సహకారంతో విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయింపునకు కృషి చేస్తామన్నారు. స్టీలుప్లాంటు ప్రైవేటీకరణ సమస్యను పరిష్కరించేంత వరకూ అవిశ్రాంత పోరాటాలకు ఉక్కు కార్మికులతో కలసి ఉంటానని హామీ ఇచ్చారు. ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాశితులకు అన్యాయం జరగనివ్వబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, కార్పొరేటర్లు బొండా జగన్, మొల్లి ముత్యాలునాయుడు, పల్లా శ్రీనువాస్, నిర్వాసిత నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, కేఎస్ఎన్ రావు, విల్లా రామ్మోహన్‌కుమార్, జెర్రిపోతుల ముత్యాలు, గంధం వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి హైస్కూల్ సందర్శించిన ఎమ్మెల్యే సుందరపు



సుందరపు విజయకుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాంబిల్లి, జూన్ 18 : మండల కేంద్రం రాంబిల్లి హైస్కూల్‌ను మంగళవారం ఎలమంచిలి నియోజకవర్గం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సందర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత తొలిసారిగా రాంబిల్లి హైస్కూల్‌కు వచ్చిన విజయకుమార్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎమ్మెల్యే విజయకుమార్‌ను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే హైస్కూల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో నాడు - నేడు కార్యక్రమంలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఈ పనులకు సంబంధించి వివరాలు పై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తానన్నారు. అనంతర విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, ఎంపీడీవో ఎస్.వెంకటాచలం, మండల విద్యాశాఖాధికారులు ఎం.సూర్యారావు, సూర్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ వర్మ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి చినదొడ్డిగల్లులో యోగా శిక్షణ

నక్కపల్లి, జూన్ 18 : మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ హైస్కూలులో ఈ నెల 19 నుంచి ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్టు హైస్కూల్ హెచ్ఎం కవిత, పీడీ ఆదిలక్ష్మి, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకులు వెంకట రమణ మాస్టారు తెలిపారు. ఈ నెల 21 ప్రపంచ యోగా దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ బినయ్‌కుమార్ పర్యవేక్షణలో యోగా టీచర్లు రాంబాబు, సాయి పిల్లలకు యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామంపై శిక్షణ ఇస్తారని తెలిపారు.

పుస్తకాల పంపిణీ

అనకాపల్లి రూరల్, జూన్ 18 : మండలంలోని మారేడుపూడి, గొలగాం పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టారు. ఆయా పాఠశాలల స్కూల్ కమిటీ చైర్మన్లు పాల్గొని పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మారేడుపూడి పాఠశాల కమిటీ చైర్మన్ పిల్లల వెంకోజి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నందున నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ వసతిగృహంలో దోమల నివారణకు చర్యలు



ఏసీఎం పిచికారి చేయిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

ఎస్. రాయవరం, జూన్ 18 : మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధి ఎస్.రాయవరంలో ఉన్న బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలోని గదుల్లో మంగళవారం మలేరియా, డెంగ్యూ వ్యాధులకు కారణమయ్యే దోమలను నిర్మూలనకు సంబంధించిన కీటక నాశిని అయిన ఏసీఎం ద్రావణాన్ని పిచకారి చేయించినట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.వాసంతి తెలిపారు. మలేరియా మాసోత్సవాలు సందర్భంగా వాకపాడు గ్రామంలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, ఫైలేరియా వ్యాధులకు కారణమైన దోమలను ఏ విధంగా నిర్మూలించాలి, ఏ విధంగా వాటి ఉత్పత్తికి అడ్డుకట్ట వేయాలి అనే దానిపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించినట్టు వాసంతి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగేశ్వరరావు, ఎస్ఎస్‌వి ప్రకాష్, డాక్టర్ పీఎస్వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్‌పై చిగురిస్తున్న ఆశలు

... 5వ పేజీ తరువాయి

అనుమతి ఇవ్వడంతో ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన డీపీఆర్ తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. 60 కిలో లీటర్ల ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.102 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. ఇందులో 85 శాతం రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీగా ఉండి బ్యాంకుల నుంచి రుణం ఇప్పించాల్సి ఉండగా, 15 శాతం గోవాడ షుగర్స్ యాజమాన్యం తన వాటాగా చెల్లించవలసి ఉంది. ఈ డీపీఆర్‌పై గత వైసీపీ ప్రభుత్వం స్పందించకపోవడంతో అక్కడితో ఇథనాల్ ప్లాంట్ ప్రక్రియ నిలిచిపోయింది.

కార్మికులు, రైతుల్లో చిగురించిన ఆశలు

కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ అధికారంలో ఉండడంతో గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు ఖాయమనే భావన అందరిలో ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అనకాపల్లి సభలో సైతం పీఎం మోదీ చెరకు రైతులను ఆదుకుంటామని కూడా హామీ ఇచ్చారు. సోమవారం చోడవరం పర్యటనకు వచ్చిన ఎంపీ సీఎం రమేశ్‌ను గోవాడ షుగర్స్ కార్మికులు కలిసిన సందర్భంగా గోవాడ భవిష్యత్తుపైనా, ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుపైనా స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు, రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఇథనాల్ ప్లాంట్ ప్రతిపాదనలు సిద్ధం



గోవాడలో 60 కిలో లీటర్ల ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.102 కోట్లతో డీపీఆర్ సిద్ధంగా ఉంది. ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర పర్యావరణ అనుమతులు కూడా వచ్చేశాయి. ప్లాంట్ ఏర్పాటయితే గోవాడ భవిష్యత్తు బాగుంటుంది. చెరకుతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటల వినియోగం వల్ల రైతాంగానికి కూడా ఉపాధి పెరుగుతుంది. ఇథనాల్ తయారీకి గిరాకీ ఉన్నందున ఆర్థికంగా గోవాడకు కలిసి వస్తుంది. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు వల్ల రైతాంగానికి, కార్మికులకు కూడా మంచి రోజులు కచ్చితంగా వస్తాయి.

- వి.సన్యాసినాయుడు, ఎండీ,. గోవాడ షుగర్స్

ఉల్లం'ఘనుల'కు చెక్ పడేనా?

... 5వ పేజీ తరువాయి

తెలిసింది. అప్పట్లో మూత పడిన పలు క్వారీలను వైసీపీ నేతలు దొడ్డిదారిన తెరిపించి తమ ఆధీనంలో పెట్టుకున్నారు. అనకాపల్లి మండలంలో మార్టూరు, మాకవరం, ఊడేరు, మామిడిపాలెం, కుంచంగి, కూండ్రంలలో వైసీపీ నాయకులు తెరిపించిన క్వారీలు నడుస్తున్నాయి. మంత్రి అనుచరుడొకరు ఈ క్వారీల అడ్డగోలు వ్యవహారాల్లో కీలకంగా ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనుమతి లేని క్వారీలను నిలిపేయాలని, కొత్త గనుల పాలసీ అమలు చేసే వరకు కొత్త, పాత క్వారీల్లో మైనింగ్ నిలిపి వేయాలని మౌఖిక ఆదేశాలు జారీ అయినా గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలు వ్యవహారాలు సాగించిన వారే యథావిధిగా కంకర క్వారీలను నిర్వహిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని వైసీపీ పెద్దల కబంధ హస్తాల్లో వున్న కంకర క్వారీలను స్వాధీనం చేసుకొని, జిల్లాలో అపారంగా ఉన్న కంకర క్వారీల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరేలా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



జన సంచారం లేక నిర్మానుష్యంగా మారిన సబ్బవరం



జనసందడి లేని అనకాపల్లి మెయిన్‌రోడ్డు



పరవాడలో పరిస్థితి...

తీవ్ర ఉక్కపోత.. వడగాడ్పులు

» ఉత్తర కార్తెను తలపిస్తున్న సూర్య ప్రతాపం » పెరుగుతున్న ఉష్ణోగ్రతలు » అనకాపల్లిలో 38 డిగ్రీలు » ఎండ దెబ్బకు జనం విలవిల

అనకాపల్లి టౌన్, జూన్ 18 : అనకాపల్లిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వర్షాలు పడాల్సిన సమయంలో ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతుండడంతో పట్టణవాసులే కాకుండా పట్టణానికి వచ్చే వివిధ గ్రామాల ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం 38 డిగ్రీలు ఉన్న అత్యధిక ఉష్ణోగ్రత మంగళవారం 38.9 డిగ్రీలకు పెరిగింది. దీంతో ప్రధాన రహదారులు జనసందడి లేక బోసిపోయాయి. ఉష్ణ తాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఫ్యాన్ కింద కూర్చున్నా వేడి గాలులు వీయడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచే ఉష్ణతాపం ప్రారంభమైంది. సాయంత్రం ఐదు గంటలు దాటినా వేడిగాలులు తగ్గకపోవడమే కాకుండా ఎండ తీవ్రత మధ్యాహ్నం మాదిరిగానే కొనసాగడం వల్ల వృద్ధులు, చంటిపిల్లలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. శీతల పానీయాల దుకాణాలు కిటకిటలాడాయి.

పరవాడలో...

పరవాడ : ఎండ తీవ్రత కొనసాగుతూనే ఉంది. గత మూడు రోజులుగా కాస్తున్న ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణికార్తె వెళ్లిపోయినా నిప్పుల కొలిమి తగ్గలేదు. మండల కేంద్రం పరవాడ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఎండతో పాటు తీవ్రమైన వడగాడ్పులు వీచాయి. ఎండతో పాటు ఉక్కపోత కూడా ప్రజలను మరింత ఇబ్బందులకు గురి చేసింది.



కోటవురట్లలో రోడ్లపై కానరాని జనసంచారం

ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత తగ్గలేదు. దీంతో ఉదయం 11 గంటలకు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండ కారణంగా పరవాడ మంగళవారపు సంత వెలవెలబోయింది. నిత్యం రద్దీగా ఉండే పరవాడ ప్రధాన రహదారి జన సంచారం లేక బోసిపోయింది. పరవాడతో పాటు సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, వాడచీపురుపల్లి ప్రాంతాల్లో కూడా ఎండ తీవ్రత కొనసాగింది. ఎండ వల్ల కార్మికులు , కూలీలు అవస్థలు పడాల్సి వచ్చింది.

కోటవురట్లలో..

కోటవురట్ల : రోజురోజుకు భానుడు సెగలు గక్కుతూ ఒకవైపు ఉక్కపోత, మరోవైపు వడగాల్పులతో ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాడు. నిప్పుల కొలిమిని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో...జనం విలవిలలాడుతున్నారు. పుష్కలంగా వర్షాలు కురవాల్సిన సమయంలో ఎండలు తీవ్రతకు ప్రజలు ఇల్లు వదిలి బయటికి రావాలంటేనే జంకుతున్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచే సూర్యతాపం మొదలైంది. పదకొండు గంటల నుంచి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఆ సమయాల్లో బస్సులు, ఆటోలు ఖాళీగా తిరిగాయి. శీతల పానీయాల దుకాణాలు మాత్రం కిటకిటలాడాయి. అత్యవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రావడం లేదు. మంగళవారం 35 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మంగళవారం జూన్ నెల వచ్చిన రెండువారాలు గడుస్తున్నా ఎండలు తీవ్రత కొనసాగడంతో ప్రజలపై సూర్యుడు తన ప్రతాపానికి చూపుతున్నాడు.

సబ్బవరంలో..

సబ్బవరం : సబ్బవరంలో మంగళవారం భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత కనిపించింది. 10 గంటలకు మరింత ఎండ తీవ్రత మరింత ఎక్కువైంది. దీంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఖరీఫ్ పనులు చేసుకునే రైతులు ఎండ ధాటికి విలవిలలాడారు. మధ్యాహ్నం రెండు గంటలకు వడగాల్పులు ఎక్కువ కావడంతో వృద్ధులు, చంటి పిల్లలు, పాదచారులు, వాహన చోదకులు ఉక్కిరి బిక్కిరయ్యారు. గ్రామాల నుంచి జనం రాకపోకలు బంద్ కావడంతో మండల కేంద్రం నిర్మానుష్యంగా మారింది.



పల్లాను కలిసిన ప్రసాద్



శ్రీనివాస్‌తో రాజు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'ను కలిసిన నేతలు

సబ్బవరం జూన్ 18 : రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా నూతనంగానియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్ల శ్రీనివాసరావును సబ్బవరానికి చెందిన జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పీబీవీ ఎస్ఎన్ రాజు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు, సీనియర్ టీడీపీ నాయకులు భరణికాన బాబూరావు, టీడీపీ నేతలు కొరాడ శ్రీనివాసరావు, కోన సోమేశ్వరరావు, గజ్జి నర్సింగరావు, ఈపు అప్పలరాజు, బందం వెంకటరమణ తదితరులు పల్లాను కలసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించి అభినందించారు.

రాంబిల్లి : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విశాఖలోని ఆయన నివాసంలో మంగళవారం టీడీపీ రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కశిరెడ్డి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు.

బోటు ప్రమాదంపై విచారణ



పూడిమడక తీరంలో విచారణ చేస్తున్న సీఐ బుచ్చిరాజు

అచ్యుతాపురం, జూన్ 18 : విజయనగరం జిల్లా ముక్కాంకు చెందిన బోటు సోమవారం అర్ధరాత్రి కాలిపోయిన సంఘటనపై అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు మంగళవారం ఉదయం నుంచి పూడిమడక తీరంలో విచారణ చేపట్టారు. ఏడుగురు మత్స్యకారులతో చేపల వేటకు వెళ్లిన ఈ బోటు విశాఖపట్నం దక్షిణాన సుమారు 28 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదానికి గురైంది. అయితే పూడిమడక పరిధిలో ఈ బోటు కాలిపోయిందని ముందుగా సమాచారం రావటంతో తాము అప్రమత్తమయామని సీఐ బుచ్చిరాజు తెలిపారు. మత్స్యకారులను విచారించామని, అయితే తాము వేట చేసే ప్రాంతంలో ఎటువంటి సంఘటనలు కనబడలేదని వారు చెబుతున్నట్టు సీఐ తెలిపారు. కాగా ప్రమాదానికి గురైన బోటులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు విశాఖ ఫిషింగ్ హార్బర్‌కి చేరారని తెలిసిందని సీఐ తెలిపారు.

కార్మికుల వేతన బకాయిలను చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తుమ్మపాల, జూన్ 18 : ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తక్షణమే జీత బకాయిలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులతో కలిసి మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

వైభవంగా శ్రీలోవాంబిక అమ్మవారి జాతర



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే సుందరపు

రాంబిల్లి, జూన్ 18 : మండలంలోని గోకివాడ గ్రామంలో కొలువై ఉన్న శ్రీలోవాంబిక అమ్మవారి జాతర మంగళవారం కన్నుల పండుగగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలను నివేదించి మొక్కలు చెల్లించారు. ఎండను సైతం లెక్క చేయకుండా భక్తులు అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారి జాతర సందర్భంగా నిర్వాహకులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పలువురు నేతలతో కలిసి లోవాంబిక అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల శాఖ అధ్యక్షులు వి.దిన్‌బాబు, పి.నూకన్నదొర, గ్రామ నాయకులు ఎన్.వి.సూర్యనారాయణ,నారాజీ, పలువురు టీడీపీ జనసేన పార్టీల నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

గండి బాబ్జీకి ఏపీఎస్‌బీసీ ఉద్యోగులు వినతి



గండి బాబ్జీకి వినితి పత్రం ఇస్తున్న ఏపీఎస్‌బీసీ కాంట్రాక్ట్/ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

సబ్బవరం, జూన్ 18 : తమకు న్యాయం చేయాలని కోరుతూ సబ్బవరం, పరవాడ, పెందుర్తి మండలాల్లో మద్యం దుకాణాల్లో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్/ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మద్య దుఖానాల్లో డిగ్రీ చదివిన యువకులు 14 వేల మందికి మద్యం దుకాణాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో అవకాశం కల్పించిందన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆదాయం కోసం ప్రాణాలకు తెగించి మద్యం దుకాణాల్లో పని చేశామన్నారు. గత ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే మద్యం దుఖానాలు ప్రైవేటుకు ఇస్తారన్న వార్తలు వస్తున్నాయనీ, తమకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. బాబ్జీ మాట్లాడుతూ.. మద్యం దుకాణాలకు సంబంధించి ప్రభుత్వం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదనీ, ఉద్యోగుల వినతిని సీఎం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

'పేట' డివిజన్‌లో 13,652 హెక్టార్లలో వరిసాగు

» 5వేల క్వింటాళ్ళ విత్తనాలు సిద్ధం
» సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు
» ఏడీఏ కె.ఉమాప్రసాద్



పాయకరావుపేట, జూన్ 18 : పాయకరావుపేట సబ్ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 13,652 హెక్టార్లలో వరి పంట సాగు అయ్యే అవకాశముందని వ్యవసాయశాఖ పాయకరావుపేట సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కె.ఉమాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడిస్తూ.. పాయకరావుపేట మండలంలో వరి 2,765 హెక్టార్లు సాధారణ విస్తీర్ణంకాగా, నక్కపల్లిలో 1,760 హెక్టార్లు, కోటవురట్లలో 1,654 హెక్టార్లు, మాకవరపాలెంలో 1,291 హెక్టార్లు, నాతవరం మండలంలో 6,182 హెక్టార్లలో వరి సాగువుతుందని అంచనా వేశామన్నారు. 5,058 క్వింటాళ్ళ వివిధ రకాల విత్తనాలను రైతులకు అందజేసేందుకు ఇండెంట్ ప్రభుత్వానికి అందజేశామన్నారు. వీటిలో పాయకరావుపేట మండలానికి 851 క్వింటాళ్ళ విత్తనాలు, నక్కపల్లి మండలానికి 777 క్వింటాళ్ళు, కోటవురట్ల మండలానికి 772 క్వింటాళ్ళు, మాకవరపాలెం మండలానికి 885 క్వింటాళ్ళు, నాతవరం మండలానికి 1,770 క్వింటాళ్ళ విత్తనాలను రైతులకు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీటిలో శ్రీకాకుళం సన్నాలు ఆర్‌జేఎల్ 2537తో పాటు సాంభమసూరి బీపీటీ 5204, ఇంద్ర ఎంటీయూ 1061, అమర ఎంటీయూ 1064, మారెటేరు సాంబ ఎంటీయూ 1224, మారెటేరు మసూరి ఎంటీయూ 1262 విత్తనాలు అందజేయనున్నామని విత్తనాలు వచ్చిన వెంటనే డివిజన్ పరిధి ఐదు మండలాల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు.

అలాగే భూమిలో సారం పెరిగేందుకు వరి పంట వేసే 45 రోజుల ముందు వేసుకునేందుకు పిల్లిపెసర, జీలుగు, జనుము తదితర సుమారు 245 క్వింటాళ్ళ పచ్చిరొట్ట విత్తనాలను డివిజన్‌లోని అన్ని మండలాల్లో రైతులకు సబ్సిడీపై అందజేసేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు వరి, పచ్చిరొట్ట విత్తనాలు అందజేసేందుకు గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకే కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

'వసతిగృహాలు ఏర్పాటు చేయాలి'

తుమ్మపాల, జూన్ 18 : జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఎస్సీ, బీసీ మహిళా కళాశాల వసతిగృహాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణేంద్రకుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఎస్సీ జిల్లా సంక్షేమ అధికారి అజయ్‌బాబు, బీసీ జిల్లా సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు వసతిగృహాలు లేక అద్దెకు ఇల్లు తీసుకుని వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. కొంతమంది పేద విద్యార్థులు అర్థాంతరంగా చదువు ఆపేసి ఇళ్లకే పరిమితమైపోతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళా కళాశాల వసతి గృహాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బి.బాబ్జి, జగదీష్, తాతాజీ పాల్గొన్నారు.

ఫార్మా కార్మికులకు కరువు భత్యం అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి డిమాండ్

పరవాడ, జూన్ 18 : ఫార్మా పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కరువు భత్యం (వీడీఏ) అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఫార్మాసిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒక్కో కార్మికుడికి కేవలం రూ.10, రూ.20లు చొప్పున కరువు భత్యం పెంచి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపేసుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఫార్మాసిటీలో వేతనాల జీవోను సవరించి కనీస వేతనాలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యారంగానికి పూర్వ వైభవం తేవాలి

» కొణతాలను కోరిన ఏపీటీఎఫ్ ప్రతినిధులు



కొణతాల రామకృష్ణతో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కొత్తూరు, జూన్ 18 : కొంతకాలంగా నిస్తేజంగా ఉన్న విద్యా వ్యవస్థ, పాఠశాలల నిర్వహణ, విద్యా బోధన తదితర అంశాలను సరిచేసి పాఠశాలలకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అనకాపల్లి శాఖ ప్రతినిధులు కోరారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొణతాల రామకృష్ణను మంగళవారం సంఘ ప్రతినిధులు కలిసి సత్కరించారు. అనంతరం సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొణతాల గణేష్, నూకేష్, కిరీటీ శాస్త్రి, సూర్యనారాయణ, మూర్తి, ప్రసాద్ తదితరులు రాష్ట్రంలోని సమస్యలను వివరించారు. 117 జీవోను వెంటనే రద్దు చేసి ఆ జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే విద్యారంగంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

అనంతరం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ.. సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్య, ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వివరిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు.

మా సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు కేజీబీవీ టీచర్ల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కేజీబీవీ టీచర్లు

రాంబిల్లి, జూన్ 18 : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం రాంబిల్లి వచ్చిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు కేజీబీవీ ఉపాధ్యాయులు వినతిపత్రాన్ని అందజేశారు. సుమారు 15 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఈ బాలికా విద్యాలయాల్లో పని చేస్తున్నామని, గత ప్రభుత్వం హయాంలో తమకు న్యాయం జరగలేదన్నారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ప్రతి నెల 1న జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, కేజీవీల్లోని అన్ని విభాగాల వారిని అర్హతను బట్టి ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ, ఉద్యోగ భద్రత కల్పించాలని, మెడికల్ అలవెన్స్ కల్పించి, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, గత సమ్మెకాలంలోని జీతాలు చెల్లించాలని వారు కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు కేజీబీవీ ఉపాధ్యాయులు, టీడీపీ, జనసేన మండల శాఖ అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో వార్షికోత్సవ పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూన్ 18 : స్థానిక గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ సప్తమ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణంలో భాగంగా ఆలయ అర్చకులు బోగాపురపు వెంకటరమణ హోమం, గోపూజ కార్యక్రమాలను చేపట్టారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకులు వీవీ రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కానీయవద్దు

» రాజానగరం గ్రామస్థుల వినతి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటనగరం వార్డు సభ్యులు, గ్రామస్థులు

పాయకరావుపేట, జూన్ 18 : మండలంలోని వెంకటనగరం పంచాయతీ పరిధిలోని రాజానగరం గ్రామం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించాలని పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్థులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దారు సూర్యనారాయణకు మంగళవారం పంచాయతీ వార్డు సభ్యుడు పారా గాలిబాబు తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం గాలిబాబు తదితరులు మాట్లాడుతూ సుమారు మూడు శతాబ్దాల నుంచి రాజానగరం పరిధిలో గ్రామం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు, ఉప్పుటేరు, శ్మశానం కబ్జాలకు గురవుతోందని ఆరోపించారు. ఉప్పుటేరు ఆక్రమణ పాలవుతున్నందున వరదల సమయంలో గ్రామం ముంపు బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాజానగరం గ్రామంలో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమణలు తొలగించడంతో పాటు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గరికిన అప్పారావు, వంకా బాబ్జీ, కోడా జగన్నాథం, ఓసిపల్లి కొర్లయ్య, పారా జగ్గ తదితరులు పాల్గొన్నారు.











బీఎన్ రోడ్డు తక్షణమే మరమ్మతు చేయండి

▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు

రావికమతం/రోలుగుంట, జూన్ 18: భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డులో ప్రస్తుతానికి రాకపోకలకు ఆటంకం లేకుండా తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆర్అండ్‌బీ అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్లతో కలిసి రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలో ధ్వంసమైన బీఎన్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకూ సుమారు 50 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ, అభివృద్ధి కోసం రూ.79.89 కోట్లు మంజూరయ్యాయని, గత పాలకుల వైఫల్యంతో రోడ్డు అసంపూర్తిగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తూతూ మంత్రంగా పనులు చేపట్టి వదిలేశారన్నారు. ఫలితంగా నాలుగు జిల్లాలకు ప్రధాన మార్గంగా ఉన్న బీఎన్ రోడ్డులో ప్రయాణించే వాహన చోదకులకు కష్టాలు తప్పడం లేదన్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రస్తుతానికి తాత్కాలిక మరమ్మతులు చేయాలన్నారు.ఎన్‌హెచ్ఏఐ కింద ఈ రోడ్డును అభివృద్ధి చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ మాడుగుల సెక్షన్ జేఈ సాయిశ్రీనివాస్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రావికమతం, రోలుగుంట మండలాల టీడీపీ నాయకులు రాజాన కొండనాయుడు, గుములూరు చంద్రమౌళి, గంజి మోదునాయుడు, వజ్రపు శివ, బంటు శ్రీను, రామకృష్ణ, పంచాడ చంద్ర, సుర్ల బాబులునాయుడు, బోడాపాత్రుని నరేష్, బంటు చిరంజీవి, పిట్ల బుల్లిబాబు, కోలిపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.



రోడ్డు అభివృద్ధిపై అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

మీ-సేవ కేంద్రాల్లో నిబంధనలు అతిక్రమణ: డీడీవో ఉదయశ్రీ

రావికమతం, జూన్ 18: మీ-సేవ కేంద్రాలు నిబంధనలు పాటించడం లేదని గ్రామ/వార్డు సచివాలయాల నర్సీపట్నం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో) ఎం.ఉదయశ్రీ తెలిపారు. మండలంలోని మేడివాడ గ్రామంలో మీ-సేవ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. మీ-సేవల ద్వారా ప్రజలకు అందించే సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు పట్టిక అతికించలేదని, ఫిర్యాదుల పుస్తకం, స్టాక్ రిజిస్టర్లు లేవని చెప్పారు. నర్సీపట్నం డివిజన్‌లో 122 మీ-సేవ కేంద్రాల్లో ఎక్కువ శాతం కేంద్రాలు నిబంధనలు పాటించలేదని గుర్తించామన్నారు. వీటిపై చర్యల కోసం ఉన్నతాధికారులను సంప్రదిస్తామని చెప్పారు.

22 నుంచి సీపీఎం శిక్షణ తరగతులు

చోడవరం, జూన్ 18: మండల కేంద్రంలో ఈ నెల 22, 23 తేదీలలో సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులలో సమస్యలపై పోరాటాలకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని, చిల్లర వ్యాపారుల మనుగడ దెబ్బతీసే విదేశీ మాల్స్‌కు అనుమతి నిరాకరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఫ్యాక్టరీల మనుగడకు చేపట్టాల్సిన చర్యలు, అసంఘటితరంగ కార్మికుల సమస్యలపై పోరాడతామన్నారు. సమావేశంలో పార్టీ నేతలు డి.వెంకన్న, ఎస్.వీ.నాయుడు, వి.వి.శ్రీనివాసరావు, నాయనబాబు, ఎస్.సత్యనారాయణ, దేముడునాయుడు, శివాజీ పాల్గొన్నారు.

బడిబయట పిల్లలపై గడపగడపకూ సర్వే

చోడవరం, జూన్ 18: గ్రామాల్లో బడికి వెళ్లని 14 ఏళ్లలోపు బాలలను గుర్తించేందుకు గడపగడపకూ సర్వే చేస్తామని ఈవోపీఆర్‌డీ బి.చైతన్య చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విద్యా శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలంతా పాఠశాలల్లో ఉండాలని స్పష్టం చేశారు. బడి బయట ఉన్న వారిని గుర్తించి ఏదో ఒక పాఠశాలలో చేర్పేలా చూడాలని సూచించారు. గ్రామ స్థాయిలో కమిటీలుగా ఏర్పాటై ఈ సర్వేను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ గాడి కాసు, ఎంఈవోలు విజయలక్ష్మి, సింహాచలం, కేజీబీవీ ప్రిన్సిపాల్ సంధ్య ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతరకు అపూర్వ స్పందన

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, జూన్ 18: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ జాతరకు అపూర్వ స్పందన లభించడం ఆనందకరమని మాడుగుల శాసన సభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం జరిగిన అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా బండారు సతీమణితో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతాయ్యబాబు, నియోజవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు ఆలయంలో అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం స్థానిక శతకంపట్టు వద్ద సిద్ధాంతి సుబ్రహ్మణ్యశాస్త్రిని అమ్మవారి ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానించారు. జాతరకు వేలాది మంది భక్తులు తరలిరావడం చూస్తుంటే అమ్మవారికి ఉన్న ఆదరణ స్పష్టమవుతున్నదని ఈ సందర్భంగా బండారు పేర్కొన్నారు.



శాస్త్రిని సన్మానిస్తున్న దృశ్యం.. కార్యక్రమంలో మాట్లాడుతున్న బండారు

హోం మంత్రిని కలిసిన రామానాయుడు

చీడికాడ, జూన్ 18: రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగల పూడి అనితను విశాఖపట్నంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అనితను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



మంత్రి అనితను సత్కరిస్తున్న దృశ్యం

'పల్లా'కు యాదవ్ నేతల అభినందన

బుచ్చెయ్యపేట: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ యాదవ నాయకులు మంగళవారం కలసి అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, యాదవ్ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి, వడ్డాది పట్టణ ఉపాధ్యక్షుడు సింగంపల్లి రమేష్ తదితరులు పల్లాను పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

ఎమ్మెల్యే రాజుకు కార్యకర్తల సత్కారం

చోడవరం: ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును గాంధీగ్రామం పంచాయతీ సిటిజన్ కాలనీకి చెందిన బోయముదిరాజ్ కులస్థులు, టీడీపీ, జనసేన కార్యకర్తలు సత్కరించారు. డి.గోవింద్, మురళీకృష్ణ, ఈశ్వర అప్పారావు, జె.అంజి, డి.అప్పలరాజు, అనూష రాజా, చిన్నారావు, రాజు, బ్రహ్మజీ, దేవుళ్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి: ఆర్‌వై పాత్రుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వై పాత్రుడు

మాకవరపాలెం, జూన్ 18: ప్రతీ గ్రామం నుంచి అభివృద్ధి పనుల జాబితాలను సిద్ధం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు సూచించారు. మంగళవారం ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావడం శుభపరిణామన్నారు. ఐదేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి కుంటిపడిందన్నారు. ఇప్పటికే ఎమ్మె ల్యేగా గెలుపొందిన చింతకాయల అయ్యన్నపాత్రుడు గ్రామాల అభివృద్ధికి పార్టీ నాయకులతో మాట్లాడం జరిగిందన్నారు. తాగునీరు, సాగునీరు, రోడ్లు వంటి పనులను గుర్తించి వాటి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే జూలై ఒకటో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఏడు వేలు పింఛన్ పంపిణీ జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో పండుగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు, వెంకటరమణ, పోతల రాంబాబు, రుత్తల జమీందార్, మండల ఉపాధ్యాక్షుడు కేతిరెడ్డి చిరంజీవి పాల్గొన్నారు.

4న అల్లూరి విగ్రహావిష్కరణ

కృష్ణాదేవిపేట, జూన్ 18: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి మైత్రి గ్రంథాలయం వద్ద జూలై 4న ఫైబర్‌తో రూపొందించిన నిలువెత్తు అల్లూరి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గ్రంథాలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రంథాలయ వ్యవస్థాపక మూలకారకులు తుని శర్మ మాష్టారు, ప్రారంభకులు శ్రీకాకుళం జిల్లా సీటీ సీఐ జిసోమశేఖర్ మంగళవారం ఇక్కడ సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. సుమారు 1.5 లక్షల నిధులతో ఫైబర్‌తో తయారు చేయించిన అల్లూరి సీతారామరాజు భారీ విగ్రహం జూలై 4న ప్రతిష్ఠ చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పోలీసులు అధికారులతో పాటు ప్రముఖులను ఆహ్వానించి వారి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేయనున్నట్టు గ్రంథాలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు పోతల శ్రీరామమూర్తి, టీవీ రమణ, పల్లి సత్యనారాయణ, వాసు, రాజు, డి.సత్యనారాయణ,నాగేశ్వరావు, శ్రీను, లచ్చు పాల్గొన్నారు.

క్విజ్ ప్రోగ్రాంలో రాంబాబు మాస్టర్ ప్రతిభ

రోలుగుంట, జూన్ 18: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'మై గౌట్ క్విజ్' ప్రోగ్రాంలో కుసర్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాంబాబు విశేష ప్రతిభ చూపారు. గత ఏడాది నవంబరు నుంచి జరిగిన ఆన్‌లైన్ పోటీల్లో స్వచ్ఛభారత్, ఆజాద్ అమృత్ మహోత్సవం, బేటీ బచావో బేటీ పడావో, వీరగాథ, ఫ్రీడమ్ ఫైటర్, వివిధ చారిత్రక ప్రదేశాలు, బ్యాంకింగ్, పరీక్ష పే చర్చ, దూరదర్శన్ తదితర అంశాలపై పాల్గొన్నారు. 100 క్విజ్ ప్రోగ్రాం విశేష ప్రతిభ కనబరిచి రెండు లక్షల క్లబ్‌లో చేరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అతనికి పలు సర్టిఫికెట్లను అందించింది. కేంద్ర ప్రభుత్వం పెట్టే క్విజ్ వల్ల విషయ పరిజ్ఞానం పెరిగిందని ఈ సందర్భంగా రాంబాబు చెప్పారు.

గోవాడ షుగర్స్‌పై చిగురిస్తున్న ఆశలు

... 5వ పేజీ తరువాయి

అనుమతి ఇవ్వడంతో ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన డీపీఆర్ తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. 60 కిలో లీటర్ల ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.102 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. ఇందులో 85 శాతం రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీగా ఉండి బ్యాంకుల నుంచి రుణం ఇప్పించాల్సి ఉండ గా, 15 శాతం గోవాడ షుగర్స్ యాజమాన్యం తన వాటాగా చెల్లించవలసి ఉంది. ఈ డీపీఆర్‌పై గత వైసీపీ ప్రభుత్వం స్పందించకపోవడంతో అక్కడితో ఇథనాల్ ప్లాంట్ ప్రక్రియ నిలిచిపోయింది.

కార్మికులు, రైతుల్లో చిగురించిన ఆశలు

కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ అధికారంలో ఉండడంతో గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు ఖాయమనే భావన అందరిలో ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అనకాపల్లి సభలో సైతం ప్రధాన మంత్రి మోదీ చెరకు రైతులను ఆదుకుంటామని కూడా హామీ ఇచ్చారు. సోమవారం చోడవరం పర్యటనకు వచ్చిన ఎంపీ సీఎం రమేశ్‌ను గోవాడ షుగర్స్ కార్మికులు కలిసిన సందర్భంగా గోవాడ భవిష్యత్తుపైనా, ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుపైనా స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు, రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఇథనాల్ ప్లాంట్ ప్రతిపాదనలు సిద్ధం

-వి.సన్యాసినాయుడు, ఎండీ, గోవాడ షుగర్స్



గోవాడలో 60 కిలో లీటర్ల ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.102 కోట్లతో డీపీఆర్ సిద్ధంగా ఉంది. ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర పర్యావరణ అనుమతులు కూడా వచ్చేశాయి. ప్లాంట్ ఏర్పాటయితే గోవాడ భవిష్యత్తు బాగుంటుంది. చెరకుతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటల వినియోగం వల్ల రైతాంగానికి కూడా ఉపాధి పెరుగుతుంది. ఇథనాల్ తయారీకి గిరాకీ ఉన్నందున ఆర్థికంగా గోవాడకు కలిసి వస్తుంది. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు వల్ల రైతాంగానికి, కార్మికులకు కూడా మంచి రోజులు కచ్చితంగా వస్తాయి.

ఉల్లం'ఘనుల'కు చెక్ పడేనా?

... 5వ పేజీ తరువాయి

తెలిసింది. అప్పట్లో మూత పడిన పలు క్వారీలను వైసీపీ నేతలు దొడ్డిదారిన తెరిపించి తమ ఆధీనంలో పెట్టుకున్నారు. అనకాపల్లి మండలంలో మార్టూరు, మాకవరం, ఊడేరు, మామిడిపాలెం, కుంచంగి, కూండ్రంలలో వైసీపీ నాయకులు తెరిపించిన క్వారీలు నడుస్తున్నాయి. మంత్రి అనుచరుడొకరు ఈ క్వారీల అడ్డగోలు వ్యవహారాల్లో కీలకంగా ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనుమతి లేని క్వారీలను నిలిపేయాలని, కొత్త గనుల పాలసీ అమలు చేసే వరకు కొత్త, పాత క్వారీల్లో మైనింగ్ నిలిపి వేయాలని మౌఖిక ఆదేశాలు జారీ అయినా వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలు వ్యవహారాలు సాగించిన వారే క్వారీలను నిర్వహిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని వైసీపీ పెద్దల కబంధ హస్తాల్లో వున్న కంకర క్వారీలను స్వాధీ నం చేసుకొని, జిల్లాలో అపారంగా ఉన్న కంకర క్వారీల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరేలా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.









